# ఆలస్యం

## యర్రంశెట్టి శాయి

సౌదామిని రిక్షా దిగి, సిద్ధంగా ఉంచుకొన్న డబ్బు రిక్షావాడి చేతిలోపెట్టి, హడావుడిగా బస్‌స్టాండ్‌లోకి నడిచింది. డీలక్స్ లాంజ్ వేపు చేరుకొనేసరికి ఒళ్లంతా చెమటలు పట్టేసినయ్.

అక్కడ "హైద్రాబాద్" వెళ్లే బస్ కోసం వెదికింది. మరేదో ఊరు వెళ్లే బస్ నిలబడి ఉంది కాని హైద్రాబాద్ బస్ కనిపించలేదు. ఆమెని ఒక్కసారిగా నిరుత్సాహం ఆవరించేసింది. అయినా కొన ఊపిరితో ఉన్న ఆశతో, పక్కనే నిలబడి మాట్లాడుకొంటున్న కండక్టర్ల దగ్గరకు నడిచి "హైద్రాబాద్ బస్ వెళ్ళిపోయిందా ?" అనడిగింది ఆత్రుతగా.

"అయిదు నిమిషాలయింది వెళ్ళిపోయి. జస్ట్ మిస్డ్ !"

సౌదామినికి దుఃఖం, నవ్వూ రెండూ వచ్చినయ్.

"జస్ట్ మిస్డ్. " తిరిగి అనుకొందామె.

ఎన్నిసార్లు వింది తనిమాట ! ఇప్పుడే కాదు. చిన్నప్పటినుంచీ ఈ ఆలస్యం మూలాన ఎన్ని పోగొట్టుకొంది ? పరీక్షలు-ఉద్యోగాలు - ఇంకా ఎన్నెన్నో—

నిస్పృహతో బస్ స్టాండ్‌లోనుంచి బయటకు నడిచిందామె.

పాపం, మీరా తనకోసం ఎంతో ఎదురుచూసి ఉంటుంది.

బస్ స్టాండ్‌లో తను కలుస్తేనే, అక్కడ దిగి తనతో రెండ్రోజులు గడుపుతాననీ - లేకపోతే హైద్రాబాద్ వెళ్ళిపోతాననీ-వ్రాసిందామె.

మీరాను చూడాలనీ- ఆమెతో రెండు రోజులు ఆనందంగా గడపగలదనీ అనుకొంది తను. అందుకే ఎంతో ఆశతో వచ్చిందిక్కడికి. బస్ స్టాండ్‌కి చేరుకోడం ఆలస్యం అయితే మీరా వెళ్ళిపోతుందని తనకు తెలుసు. అయినా ఆలస్యమయిపోయింది. త్రోవలో సిటీ బస్ ఫెయిలయిపోయింది. అక్కడినుంచి మెయిన్‌రోడ్డువరకూ మైలుదూరం నడిచి వేరే బస్‌లో మార్కెట్ చేరుకొని, అక్కడినుంచి రిక్షాలో వచ్చేసరికి - ఈ ఆలస్యం అయిపోయింది.

"జస్ట్ మిస్డ్. "

కోపం, ఉక్రోషం ఒకేసారి కలిగినయ్యామెకి. కాని ఎవరిమీద అలుగుతుంది తను ? బస్ చెడిపోడానికి బాధ్యులెవరు ? బాంక్‌లో ఉద్యోగానికి ఇంటర్వ్యూ కెళ్లేప్పుడు రైలు ఆరు గంటలు లేటయి ఇంటర్వ్యూ టైమ్ కాస్తా దాటిపోయినప్పుడు - అందుకు బాధ్యత ఎవరిది ?

"రిక్షా కావాలామ్మా ?"

"వద్దు. "

ఇంతకూ ఇప్పుడు తనేం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి ? తమ ఊరు వెళ్లే సిటీ బస్ సాయంత్రం నాలుగింటికి. ఈ నాలుగ్గంటలూ ఎలా గడపాలి ?



ఏమీ తెలీలేదామెకి. ఫుట్‌పాత్‌మీద నెమ్మదిగా నడువసాగింది.

"పోనీ, ఏదయినా సినిమా కెళ్తే?"

ఆ ఆలోచన బాగానే ఉందనిపించిందామెకి.

కాని...మార్నింగ్ షో అందుతుందా? టైము పదకొండు దాటింది.

రోడ్డు ప్రక్కనే గోడలమీద వాల్ పోస్టర్స్ చూస్తూ నడువసాగిందామె. రెండు ఇంగ్లీష్ సినిమాలున్నాయ్, కాని అవి పదకొండింటికే మొదలు. కొత్తగా రిలీజయిన తెలుగు సినిమా కూడా సరిగ్గా పదకొండింటికే అని ఉంది. రిక్షా ఎక్కి ఆ హాలు దగ్గరకు చేరుకొంది సౌదామిని.

బయట విపరీతమయిన జనం !

"స్త్రీల క్యూలో నుంచుందామె.

పన్నెండయిపోయినా ఇంకా టిక్కెట్లివ్వడం మొదలుపెట్టకపోయేసరికి అనుమానం వచ్చి ముందున్నామెని అడిగింది.

"ఇది మాట్నీ క్యూ. మార్నింగ్ షోకి ఇంతకుముందే అయిపోయినయ్ టిక్కెట్లు."

సౌదామినికి నవ్వొచ్చింది.

మళ్ళీ ఇక్కడ కూడా ఆలస్యం !

"జస్ట్ మిస్డ్."

సినిమాహాల్లోంచి బయటి కొచ్చిందామె.

ఇప్పుడేమిటి చెయ్యటం ?

తను పదేళ్ళక్రితం మీరాతోపాటు అద్దెకున్న ఇల్లు చూడాలనిపించిందామెకి. పూర్ణానందంపేటలో ఉందది.

కాని ఎందుకా ఇల్లు చూడటం ? ఏవేవో పాత స్మృతులను మననం చేసుకోడంతప్ప ఇంకేముంటుంది ?

ఎటూ నిర్ణయించుకోలేక అక్కడే నిలబడిపోయిందామె.

హఠాత్తుగా ఆమె కళ్ళ ఎదురుగా ఉన్న పెద్ద సినిమా బోర్డుమీద పడినయ్. శతదినోత్సవ సందర్భంగా - నటీనటుల ఆగమనం ! నటీనటుల పేర్లలో వినోద్ పేరుంది. హీరో వినోద్—

మొదటిసారిగా వినోద్ హీరోగా నటించాడుట.



అంటే వినోద్ ఇప్పుడు ఆ హాలు కొస్తాడన్నమాట ! కొద్దిక్షణాలు ఆమె మనసంతా ఆనందంతో ఊగిపోయింది.

ఎంతకాలమయిపోయింది – వినోద్‌ని చూసి !

పదేళ్లు పైగానే !

తను, మీరా, ఉన్న ఇంటి ఎదురుగానే గదిలో ఉండేవాడు.

ఆ సినిమాహాలు వేపు నడువ సాగింది సౌదామిని.

వినోద్ కార్లో వస్తాడు కాబోలు ! అతన్ని చూడడానికి బయట జనం ! నవ్వు వచ్చింది సౌదామినికి.

అతను తనకెంతో సన్నిహితుడనీ – తను ఎదురు రాందే ఇంట్లోంచి బయటకు కదిలేవాడు కాదనీ – ఎంత మందికి తెలుసు.

అతను చెప్పేవరకూ తనకూ తెలీదు. రోజూ తను ఆఫీసు కెళ్ళడానికి బయటకు వస్తూంటే – అతనూ అప్పుడే గదిలోనుంచి బయటి కొచ్చేవాడు. తను ఎదురొస్తే అతనికి ఎంతో మంచి జరుగుతుందని నమ్మకం ఉందట.

అసలా రోజులు ఎంత సరదాగా గడిచేవి ?

మీరా స్కూల్లో టీచరుగా చేరింది. తనూ అక్కడే ఓ ఆఫీసులో టైపిస్ట్ ఉద్యోగంలో చేరింది. మీరాతోపాటు తనూ ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. ఇద్దరికీ మీరావాళ్ల అమ్మమ్మ వండి పెడుతుండేది.

రోజూ రాత్రి పన్నెండింటివరకూ వినోద్ గట్టిగా డ్రామా పోర్షన్ చదువుతూండటం తమకు వినపడుతుండేది.

కొద్దిరోజులు అతను తమ వంక కన్నెత్తి చూడలేదు.

ఓ రోజు సాయంత్రం, తను ఆఫీసు

నుంచీ వచ్చి టీ తాగుతూ కూర్చుంది. హాల్లో ! వినోద్ తలుపుదగ్గర నిలబడి "ఏమండీ !" అని పిలిచాడు.

"ఏమిటి ?" లేచి అతని దగ్గరగా వెళ్తూ అడిగింది తను.

"నేను డ్రామాలో కొద్దిసేపు "స్త్రీ" లాగా నటించాలి! రేపు రాత్రికి డ్రామా ఉంది. మీరు ఒక చీరా-జాకెట్టూ ఇస్తే-ఎంతో సహాయంచేసిన వారవుతారు." అన్నాడు బ్రతిమాలుతూ.

తనకి నవ్వు వచ్చింది. ఇతగాడు ఆడవేషం వేస్తాడా ? ఇక జనం బ్రతికినట్లే ! ఎంచేతో కాదనాలనిపించలేదు. వెంటనే తన చీర ఒకటి - జాకెట్ ఒకటి-అతని కందించింది.

"చాలా థాంక్సండీ ! ఎల్లుండి మళ్ళీ మీ కిచ్చేస్తాను !" అంటూ అవి తీసుకొని వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రం తనూ, మీరా ఆ విషయమే తల్చుకొని నవ్వుకొంటూండగా త్వరత్వరగా వచ్చాడతను.

"ఇవిగోండి ! ఈ రెండు పాసులూ తీసుకోండి ! రాత్రికి డ్రామాకి మీరు తప్పక రావాలి !" అన్నాడు నవ్వుతూ.

"సరే !" అన్నారు తామిద్దరూ.

ఆ డ్రామాకి వెళ్ళాలని ఇద్దరూ అనుకోలేదుగాని, తీరా పొద్దుగూకాక మీరాకు వెళ్ళాలనిపించింది.

"సరదాగా చూసి వద్దాం ! ఎప్పుడో కాలేజిలో చూడటమేగా డ్రామాలు !" అందామె. తనకీ కొద్దిగా కుతూహలంగానే ఉంది.

ఇద్దరూ నడుచుకొంటూ వెళ్ళారక్కడికి.

లోపల ఏమంత రష్‌లేదు. సరిగ్గా అప్పుడే డ్రామా మొదలయింది. వినోద్ హీరో ! నిజంగా హీరోలాగానే అనిపించాడు తనకి ! అక్రమాలూ, అన్యాయాలూ చేసి ప్రజల్ని మోసగిస్తున్న ఆ ఊరి ప్రెసిడెంటుగారికే ఎదురుతిరిగాడు వినోద్ ! అతని సంభాషణ, ఉచ్ఛారణ, నటన - తనను కదిలించి వేసినయ్.

తమ ఇంటి కెదురుగా రూములో ఉండే వినోద్‌లో ఇంత గొప్ప ప్రతిభ ఉందా ?

రెండో సీన్లో ప్రెసిడెంట్‌ని మోసం చేసి, అతని గుట్టంతా బయటకు లాగటానికి "స్త్రీ" వేషంలో వచ్చాడు వినోద్.

అతనిని ఆ వేషంలో చూస్తే తనకూ, మీరాకూ కూడా నవ్వాగలేదు. అతను తిప్పుకొంటూ నడవడం-కులుకుతూ మాట్లాడటం చూస్తూ నవ్వనివారే లేరు. ఆ రాత్రి డ్రామా ముగిశాక ఇంటికొచ్చిన తరువాత కూడా చాలాసేపు అతని గురించే గుర్తు తెచ్చుకొని నవ్వుకుంటూ ఉండిపోయారిద్దరూ.

మర్నాడు సాయంత్రం తను ఆఫీసు నుంచి వచ్చిన కొద్దినిమిషాలకే అతనూ ఇంటికొచ్చాడు.

"ఇవిగోండి, మీ బట్టలు," అన్నాడు నవ్వుతూ.

అందుకొని "కూర్చోండి !" అంది తను.

కుర్చీలో కూర్చున్నాడతను.

"మీరు డ్రామాకి రాలేదనుకొంటాను" అన్నాడతను.

"భలేవారే ! ఎందుకు రాలేదు ? మీ ఆడవేషం చూసి రాత్రంతా నవ్వుకొంటూనే ఉన్నాం !" తిరిగి నవ్వేస్తూ అంది తను.

"థాంక్యూ ! మీకూ నాటక కళ అంటే అభిమానం ఉందన్నమాట" అన్నాడతను. తనేమీ మాట్లాడలేదు.

"నాటకం చాలా బాగా వచ్చింది లెండి.! నేనూ హీరోగా నటించడం ఇదే మొదలు ! అంతా చాలా బాగా నటించానని అన్నారు ! అసలు ఆ నాటకం అంత బాగా రావడానికి కారణం ఏమిటనుకొన్నారు ?"

తను అతనివంక చూసింది, అర్థం కానట్లు !

"మీరే ! నాకో సెంటిమెంటుంది ! మీరు నవ్వినా ఫరవాలేదు ! ఏ పనిమీద బయల్దేరినా ఇంట్లోంచి బయటి కడుగు పెట్టేటప్పుడు-నా మనసుకి నచ్చిన వారెవరయినా ఎదురొస్తేనే బయల్దేరతాను ! మా ఊళ్ళో ఉన్నప్పుడు మా అత్తయ్య ఎదురొచ్చే దనుకోండి ! ఎటొచ్చీ ఇక్కడి కొచ్చాక కష్టమయిపోయింది. నెల్రోజులక్రితం మీరీ ఇంటికొచ్చాక నాకు మళ్ళీ మీ కోసం ఎదురుచూడటం అలవాటయిపోయింది.

మొదటిరోజు అనుకోకుండా నేను గదిలోనుంచి బయటి కొచ్చేప్పుడే-మీరూ ఆఫీస్ కెళ్తూ ఎదురొచ్చేరు - ఆ రోజు ఎంత లాభమయిందో తెలుసా ? నా బి. ఏ. రిజల్ట్స్ వచ్చినయ్ ! ఠకీమని పాసయిపోయేను !

అంతే ! ఆ రోజునుంచీ మీరు ఆఫీసుకి బయల్దేరేప్పుడే - నేనూ గదిలో నుంచి బయటి కడుగుపెట్టటం అలవాటయిపోయింది ... ఉత్సాహంగా, నిర్మలంగా మాట్లాడుతోన్న అతనిని చూస్తూంటే తమాషాగా ఉంది తనకు !

"నాకు కొంచెం నాటకాల పిచ్చి ఎక్కువలెండి ! అందుకే ఉద్యోగం దొరికేలోగానే పూర్తిగా నాటక కళ అంతు చూద్దామనుకొంటున్నాను !" తిరిగి అతనే అన్నాడు.

ఈ లోగా మీరా స్కూలునుంచి వచ్చేసింది.

"డ్రామాకి వచ్చినందుకు చాలా థాంక్సండీ !" ఆమెతో అన్నాడతను.

"మీరు చాలా బాగా యాక్ట్‌చేశారు" అంది మీరా నవ్వుతూ.

మరికాసేపు కూర్చుని అతను వెళ్ళిపోయాడు.

మరి రెండురోజుల తర్వాత సాయంత్రం నాలుగున్నరకి తన ఆఫీసు కొచ్చాడతను.

"నమస్తే !" అన్నాడు టేబిల్ మీద రెండు చేతులూ ఉంచుతూ.

"నమస్తే !" అంది తను ఆశ్చర్యంగా.

"మీతో చిన్న పనుండి వచ్చాను !"

"ఏమిటో చెప్పండి !"

"నా సర్టిఫికెట్ ట్రూ కాపీస్‌మీద మీ ఆఫీసరుగారి సంతకాలు కావాలి !"

"కూర్చోండి, చేయించిస్తాను. " అంటూ బల్ల చూపించింది.

అతను కూర్చుని ఒరిజినల్ సర్టిఫికెట్లు - ట్రూ కాపీలు ఆమె ముందుంచాడు.

అయిదయిపోయాక ఆఫీసర్ గదిలోకి నడిచి వాటిమీద సంతకాలు తీసుకొంది తను. అవి అందించగానే ఆనంద పడిపోయాడతను.

"చాలా థాంక్సండీ ! రేపే లాస్ట్ డేట్ అప్లయ్ చేయడానికి ! వీటిమీద సంతకాలు ఎలాగ అని ఆలోచిస్తూంటే మీరు గుర్తొచ్చారు. మీకు శ్రమ ఇవ్వక తప్పలేదు. "

"ఇందులో శ్రమేముంది , లెండి " అంది తను నవ్వుతూ.

అయిదయిపోవడంచేత తనూ అతనితోపాటు బయటకు నడిచింది.

"మీకేం అభ్యంతరం లేకపోతే - అలా హోటల్లో కాఫీ త్రాగి వెళ్దాం రాకూడదూ ?" అడిగాడతను.

ఎంచేతో అతని కోరికను తోసిపుచ్చలేకపోయింది తను.

ఇద్దరూ ఎసి రూమ్‌లో కూర్చున్నారు.

"నేను వచ్చేవారం రాజమండ్రిలో జరుగబోతోన్న నాటక పోటీల కెళ్తున్నాను. మా సమాజం తరపున మంచి డ్రామా తీసుకెళ్తున్నాం లెండి. సినిమా దర్శకులు, ప్రొడ్యూసర్లు కూడా వస్తున్నారట. కనుక బాగా చేయగలిగితే సినిమాల్లో అవకాశం రావచ్చు. మీరు నాకు సహాయం చేశారంటే తప్పక బెస్ట్ యాక్టర్ ఎవార్డ్ కొట్టేస్తాను " అన్నాడతను.

"నేనేం చేయాలి ?" ఆశ్చర్యంగా అడిగింది తను.

"ఆ రోజు సాయంత్రం నాలుగ్గంటలకు స్టేషన్ కెళ్ళాలి. మీరు ఆ టైములో నా కెదురు రావాలి. "


తనకు నవ్వాగలేదు.

"బాగుంది ! నా ఆఫీసో ?" అంది నవ్వాపి.

"ఓ గంట పర్మిషన్ పెట్టి ముందుగా వచ్చేయకూడదూ ? నా కోసం ! ప్లీజ్ !"

"సరే, వస్తాను ! కానీ నాకేమిటి లాభం? ఎదుర్రావటం నా వంతూ, ప్రైజులూ, పొగడ్తలూ మీ వంతూనా!" చిలిపిగా అంది తను.

"పోనీ నాకొచ్చే బహుమతుల్లో మీకూ భాగమిస్తాను !" నవ్వుతూ అన్నాడతను.




రెండు రకాల స్వీట్లు ఆర్డర్ చేశాడతను.

"నేను ఇన్ని తినలేను " అంది తను.

"మీకు లంచం ఇస్తున్నాను ఆ రోజు కోసం !" -

నవ్వేసింది తను.

ఇద్దరూ హోటల్లోంచి బయట కొచ్చారు.

"మీరూ ఇంటికేనా ?" అడిగింది తను.

"అవును. మీరూ నడిచే వస్తారా?" తలూపింది తను.

తనకి తెలీకుండానే అతని ఆకర్షణకి లోబడిపోతోంది తను !

దారిపొడుగునా ఏవేవో నాటకాల గురించి చెబుతూనే ఉన్నాడతను.

"వీలయితే మీరూ రాజమండ్రి నాటక పోటీలకు సరదాగా రాకూడదూ! మీరు పక్కనుంటే ప్రపంచాన్నే జయించగల ననిపిస్తుంది నాకు !"

"ఊహూ, నాకు కుదరదు " అంది తను ఖచ్చితంగా.

"పోనీలెండి ! మిమ్మల్ని బలవంత పెట్టను !"

ఇళ్ళు చేరుకొన్నారు.

"ఓకే ! చాలా చాలా థాంక్సండీ ! మీ దగ్గర ఎన్నో సహాయాలు అందు కొంటున్నాను ! మరి మీ ఋణం ఎప్పటికి తీర్చుకుంటానో ఏమో !"

"తీర్చకపోతే మిమ్మల్ని వదలను లెండి !" నవ్వుతూ అంది తను.

రాజమండ్రి వెళ్లే రోజు ఉదయమే వచ్చి మళ్ళీ గుర్తుచేసి వెళ్ళాడతను.

ఆ రోజు మధ్యాహ్నం శెలవుపెట్టి ఇంటికొచ్చేసింది తను.

"ఏవండోయ్ ! రడీయేనా ?" నాలు గ్గంటలకు అరచాడతను.

"ఆ, రడీయే !"

తను బయటకొచ్చింది. అతనూ అప్పుడే బయల్దేరి ఆమె కెదురుగా వచ్చాడు.

"మీరు నాకెప్పుడూ ఇలాగే ఎదు రొస్తుండాలని కోరుకొంటున్నాను, ఆ దేముడిని " అన్నాడతను వెళ్లేముందు.

తను సిగ్గుపడిపోయింది.

అతని మాటల కర్థం ఏమిటి ? తామిద్దరూ వివాహం చేసుకోవాలనా ? మనసులో తనూ అదే కోరుకొంటోంది.

వారంరోజుల తరువాత పేపర్లో వినోద్ ఫొటో చూసింది తను.

పోటీలలో ఉత్తమ నటుడి బహుమతి గెల్చుకొన్నట్లు ప్రచురింపబడింది.

ఆనందంతో ఉక్కిరి బిక్కిరయి పోయింది తను.

"మీరా, ఇదిగో, చూశావా ! వినోద్ బెస్ట్ యాక్టర్ ఎవార్డ్ కొట్టే శాడు " అంది మీరాతో.

మీరా నవ్వింది.

"నువ్వే గెలిచినంత సంతోషంగా ఉందే నీకు !"

తను సిగ్గుపడిపోయింది.

మరో నాలుగయిదురోజుల తరువాత వినోద్ వచ్చాడు.

సరాసరి ఆఫీస్ కే వచ్చేశాడతను.

"బెస్ట్ యాక్టర్ కొట్టుకొచ్చేశాను చూశారా " అన్నాడు పెద్ద కప్పు తీసి చూపుతూ.

"నాకు ముందే తెలుసు. పేపర్లో చూశాను " అంది తను.

"ఇంకా చాలా న్యూసుంది. ముందు మీకు చెప్పిగాని, మరొకరికి చెప్ప కూడదనుకొన్నాను." నవ్వుతూ అన్నా డతను.

"ఏమిటది ?"

"ఒక ప్రొడ్యూసరు అప్పటికప్పుడే వాళ్ళ పిక్చర్‌లో చిన్న వేషం ఇచ్చాడు !"

"నిజమేనా ?" ఆశ్చర్యపోతూ అంది తను.

"మీ దగ్గర అబద్ధం చెప్తానా ?" చిలిపిగా అన్నాడతను.

తనకి ఆ వార్త, సంతోషం, భయం రెండూ కలిగించింది.

"అయితే తమరిక మద్రాసుకి మకాం మార్చేస్తారన్నమాట " అంది ఉత్సాహంగా.

"ప్రస్తుతానికి తప్పదు మరి !..."

"మరి అక్కడ మీ కెదురెవ రొస్తారు ?"

అంతవరకూ ఉత్సాహంగా ఉన్న అతను చప్పున క్రుంగిపోయాడు.

"అవునండీ ! ఆ విషయం ఆలో చించనేలేదు !"

"భలేవారే మీరు ! ఈ రోజుల్లో కూడా ఇంకా పాత అలవాట్లు, మూఢ ఆచారాలు పట్టుక్కూర్చున్నారేమిటి ?"

"మీకో విషయం చెప్పనా ?"

"ఏమిటది ?"

"మీరేమీ కోప్పడనంటే చెప్తాను ."

తనకి గుండెలు వేగంగా కొట్టుకో సాగినయ్. "ఏం చెప్పబోతున్నా డతను ?"

"ఫరవాలేదు, చెప్పండి. "

"నిజానికి నా కసలు- ఇలా ఎదురు రావటంమీదా - శకునాలమీదా నమ్మకం లేదు. కేవలం మీతో పరిచయంకోసం- మీ మీద ఇష్టంతో - అవన్నీ కలిపించి చెప్పాను ! ఇంకా చెప్పాలంటే... మీరు...మిమ్మల్ని చూసిన మరుక్షణం నుంచే ప్రేమిస్తున్నాను..."

తనకి కోపం - నవ్వూ - రెండూ వచ్చినయ్ !

"అయితే నా దగ్గర కూడా నటిం చారన్నమాట !"

"సారీ ! మీ కోసమే - మీ దగ్గర కూడా నటించాల్సి వచ్చింది !"

తను పెన్నుతో తెల్లకాగితంమీద తన పేరు రాస్తూండిపోయింది.

"నన్ను వివాహం చేసుకోవడం మీకు అంగీకారమేనా ?"

చిరునవ్వు నవ్వింది తను.

"ఆఫీసులోనా ఈ విషయాలు " అంది నవ్వాపుకుంటూ.

"సరే, తరవాత కలుసుకొంటాను!" వెళ్ళిపోయాడతను.

మరికొద్దిరోజుల తర్వాత అతను మద్రాసు వెళ్ళిపోయాడు. తను స్టేషన్ కెళ్ళింది. తన చేతిని అందుకొని పెదాలతో స్పృశించాడతను.

"అక్కడ పరిస్థితెలా ఉంటుందో తెలీదు ! సినిమాల్లో సెటిలయితే మీరూ వచ్చేద్దురుగాని !"

కళ్ళల్లో నీళ్లు నిండుతుండగా తలూ పింది తను.

రైలు వెళ్ళిపోయింది.

అంతే ! అతని దగ్గర్నుంచి ఒకటి రెండు ఉత్తరాలు వచ్చినయ్ !

"సౌదా ! నేనిక్కడ నటిస్తున్నాను. సినిమాల్లో - సినిమా బయటా కూడా నటనే ! ఈ జీవితం నాకు విసుగు కలిగిస్తోంది. కాని ఈ గ్లామరస్ ప్రపంచాన్ని వదలడం కూడా కష్టమే ! నేను నటన వృత్తిగా తీసుకోకుండా ఉంటే ఎంత బావుండేదో అనిపిస్తోంది ! ఆఖరికి నీ ప్రేమను పొందటానికికూడా

నటించాల్సి వచ్చింది. మన ప్రేమ ఒక్కటే నిజం ! మిగతా జీవితమంతా నటనే. అదొక్కటే నాకు దక్కనిస్తావ్ కదూ ! త్వరలోనే కలుసుకొన డానికి ప్రయత్నిస్తున్నాను—నీ

వినోద్."

దానికి తను జవాబీయలేదు.

ఆ ఉత్తరం మీరా చేతిలో పడింది.

"నమ్మక నమ్మక సినిమా మనుషుల్నా నువ్ నమ్మేది ? తర్వాత విచారిస్తావ్ జాగ్రత్త!" అంది. ఆ తరువాత ఉత్తరాలే లేవతనినుంచి.

అప్పటికి తను పనిచేస్తోన్న ఉద్యోగ కాలం ముగిసిపోయింది. వెంటనే తన ఊరు చేరుకోవడం – అక్కడ వివాహం నిశ్చయమయిపోవడం–పిల్లలు–

తల్లిదండ్రుల్ని ఎదిరించి – అతని దగ్గరకు వెళ్ళి – అతనినే వివాహమాడేంత ధైర్యం తనకు లేకపోయింది! పైగా అతనిమీద నమ్మకం తగ్గిపోయింది! బహుశ అది అతని సినిమా జీవితం కలుగజేసిన అభిప్రాయం !

సినిమాహాలు ఎదుట జనం క్రిక్కిరిసిపో యున్నారు !


పోలీసుల విజిల్స్ – తోపులాటలు–

అయితే చివరకు వినోద్ సాధించాడన్నమాట !

స్త్రీలవేపు నడిచి అక్కడ కొంచెం వెనుకగా ఉన్న అరుగుమీద నిలబడింది సౌదామిని !

మరికొద్దిసేపట్లో లాఠీలు గాలిలోకి లేచినయ్. పోలీస్ విజిల్స్ – సినిమా హాల్లోనుంచి బయటికొస్తున్న కారుమీద విరుచుకుపడ్డారు.

వినోద్ బాక్ సీట్లో కూర్చుని కిటికీలోనుంచి స్త్రీలవేపు చూసి చేయి ఊపుతున్నాడు నవ్వుతూ.




హఠాత్తుగా అతని కళ్లు తన కళ్ళని కలుసుకొన్నాయ్ !

అతని ముఖంలో ఆశ్చర్యం – ఆనందం – ప్రేమ – అన్నీ కలిసిపోయి ప్రతిబింబిస్తున్నాయ్ ! అతని పెదాలు వణుకుతూ కదిలినయ్ !

డోర్ తెరచుకొని దిగడానికి ప్రయత్నించాడతను.

మరుక్షణంలో సౌదామినికి అర్థమయిపోయింది. అతను తనకోసం దిగుతున్నాడు. అతని కందితే – తన జీవితమే అల్లకల్లోలమయిపోతుంది.

అతని కళ్ళల్లో తనని చూడగానే ఉప్పొంగిన భావాలు తను తేలిగ్గా చదివింది. ఏమయినాసరే – అతనికి దొరకక్కూడదు

వెనక్కు తిరిగి స్త్రీల మధ్యగా జొరబడి తోసుకుంటూ చివరకు వెళ్ళిపోయింది సౌదామిని. అక్కడ ఖాళీగా ఉన్న రిక్షా ఎక్కి "త్వరగా మార్కెట్ కి పోనీ!" అంది ఖంగారుగా!

పావుగంటలో మార్కెట్ చేరుకొని తమ ఊరు పోయే సిటీ బస్‌స్టాప్‌దగ్గర నిలబడి "అమ్మయ్య" అని తేలిగ్గా గాలి పీల్చుకొంది.

తను అతనిని సరిగ్గా అర్థంచేసుకోలేకపోయింది. అతనిది సాధారణమయిన ప్రేమకాదు ! తనకోసం – ఏమయినా చేయగల ప్రేమ !

కాని ఇప్పుడది అర్థంచేసుకొని ఏం లాభం ?

చాలా ఆలస్యమయిపోయింది ! టూ లేట్ !

సిటీ బస్ వచ్చి ఆగింది స్టేజిదగ్గర. ఎక్కి సీట్లో కూర్చుంది సౌదామిని. వేగంగా పోతోంది బస్ !

ఆమెకి ఇంటిదగ్గర తనకోసం ఎదురుచూసే భర్తా—పిల్లలూ గుర్తొచ్చారు.

ఊహ ! త్వరగా వెళ్ళిపోవాలి !

ఆలస్యంకాకుండా వాళ్ళని చేరుకోవాలి ! తన కింకేమీ వద్దు ! ఈ జీవితాని కింతేచాలు ! కళ్ళ వెంబడి జారిపోతోన్న కన్నీటిని కర్చీఫ్‌తో తుడుచుకొందామె.